## క్లుప్తంగా

### అమృతోక్తులు సంకలనం ఆవిష్కరణ



అమృతోక్తులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు ఉపాధ్యాయులు సంకలనం చేసిన అమృతోక్తులు నీతి పద్యమాలిక పుస్తకాన్ని కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఆవిష్కరించారు. స్థానిక రేచర్లపేట కాకినాడ నగరపాలక సంస్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మట్టపర్తి గంగారామ్, తామరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు దాడి చంద్రశేఖరరావు సంకలనం చేసిన ఈ పుస్తకాన్ని జేసీ రాహుల్ మీనా, డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్‌తో కలిసి ఆయన గురువారం ఆవిష్కరించారు. ప్రాథమిక స్థాయి చిన్నారులు, పాఠశాల విద్యార్థుల్లో భాషా జ్ఞానం పెంపొందించేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ పేర్కొన్నారు.

### ఉద్యమ నేత వుప్పలూరికి ఘన నివాళి



సభలో పాల్గొన్న వివిధ సంఘాల కార్మికనేతలు

కాకినాడ రూరల్: ఉద్యమ నేత వుప్పలూరి సుబ్బారావు ఆదర్శనీయుడని భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం యూసీసీఆర్ఐ ఎంఎల్ నాయకుడు కామ్రేడ్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో శ్రీ కన్వెన్షన్ హాలులో గురువారం సుబ్బారావు శత జయంతిని నిర్వహించి నివాళులర్పించారు. సభకు ఎఫ్ఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు జేవీవీఎస్ఎన్ రాజు అధ్యక్షత వహించగా కాకినాడలోని కోరమాండల్ కర్మాగారం, రాజమండ్రి పేపరు మిల్లు, పిఠాపురం పంచదార మిల్లు కార్మికుల తరఫున వుప్పలూరి పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎఫ్ఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ఎస్ఎన్ మూర్తి పోరాట పటిమను తెలియజేశారు. కార్యక్రమంలో వుప్పలూరి పెద్ద కుమార్తె లక్ష్మి, కోమాండల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు నూకరాజు, శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, కె.వెంకటరావు, డక్కన్ షుగర్స్ కార్మిక సంఘ మాజీ నాయకులు రామదాసు, రామకృష్ణ, సోమన్న పాల్గొన్నారు.

### గొడ్డటిపాలెం చిల్డ్రన్స్ హాస్టల్ విద్యార్థుల తరలింపు



గొడ్డటిపాలెం హాస్టల్ విద్యార్థులను ఇంటికి తీసుకువెళ్తున్నట్టు తల్లుల నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్న సీడీపీఓ

కరప: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మండలం గొడ్డటిపాలెంలోని జీవనజ్యోతి చిల్డ్రన్స్ హాస్టల్‌ను అధికారులు తనిఖీ చేసి విద్యార్థులను ఇతర వసతి గృహాలకు తరలించారు. గురువారం ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి, ఐసీపీఎస్ ఓఆర్‌డబ్ల్యూ చిన్నబాబు, సెక్టార్ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి తదితరులు సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, వీఆర్వో డి.భరణితో కలసి ఆ హాస్టల్‌ను తనిఖీ చేసి అనుమతులు లేకపోవడం, కనీస వసతులు లేకపోవాన్ని తప్పుపట్టారు. ఆ హాస్టల్‌లో 14 మంది విద్యార్థుల్లో నలుగురిని కరపలోని షారోన్ హాస్టల్‌లోను, మరో నలుగురిని జగన్నాథపురంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చేర్పించారు. ఐదుగురు బాలురను వారి తల్లులకు అప్పగించగా, ఇష్టపూర్వకంగా ఇంటికి తీసుకెళుతున్నట్టు వారి నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. ఇంగా 18 ఏళ్ల పైబడిన దివ్యాంగులు ఉన్నారని, వారిని వారికి తగ్గ హాస్టల్ ఎక్కడ ఉందో పరిశీలించి అక్కడ చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీడీపీఓ తెలిపారు.

### విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

భారత క్రికెటర్ భరత్

పెద్దాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్ జట్టు క్రీడాకారుడు కెఎస్ భరత్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో గురువారం ఆ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశం తరఫున 69 మ్యాచ్‌ల్లో 3,909 పరుగులు సాధించానని, కీపర్‌గా 232 క్యాచ్‌లు పట్టానని భరత్ పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, అంకితభావం అవసరమని ఆయన అన్నారు. జాతీయ హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కామిరెడ్డి రాజేష్‌తో పాటు విజయ్‌ప్రకాష్ తదితరులు ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం భరత్‌ను సత్కరించారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### నిందితులను తప్పించే కుట్ర

కోల్‌కతా వైద్య విద్యార్థినిపై దాష్టికం యావత్ దేశాన్ని కదిలించింది. నిందితుడిగా చెప్తున్న సంజయ్ రాయ్ తన పుట్టిన రోజు వేడుకల్ని అత్యాచారం, హత్య ఉదంతాల్లో అనుమానితుడిగా ఉన్న ఆర్‌జీ కార్ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ చాంబర్‌లో జరుపుకోవడం తాజాగా ఫొటోతో సహా వెలుగులోకి వచ్చింది. విచారించదగ్గ ఎన్నో కోణాలను కావాలనే విస్మరిస్తున్నారు. కుట్ర కోణాన్ని ఛేదించి సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి. మరో ఆడపిల్ల ఇటువంటి దారుణానికి గురికాకుండా చూడాలి.

డాక్టర్ సింధూర, పీజీ, జనరల్ సర్జరీ, ఆర్ఎంసీ, కాకినాడ



### వైద్యుల వెంట యావత్ దేశం



గతంలో ఎన్నడూ లేని రీతిలో కోల్‌కతా వైద్యురాలికి జరిగిన అన్యాయానికి దేశం మొత్తం ఏకమైంది. వైద్యుల వెంట యావత్ దేశం ఉంది. ఈ స్ఫూర్తితోనే మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు విశ్రమించం. ఆర్ఎంసీలో నిరసన కొనసాగుతుండగా అన్ని వర్గాల మద్దతు లభించింది. కలకత్తాలో గురువారం క్రీడాకారులంతా ఏకమై మామితకు జరిగిన దారుణాన్ని ఖండించారు. దేశం చర్చించే రీతిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. క్రీడాకారులకు వైద్యుల తరఫున ధన్యవాదాలు.

డాక్టర్ దేవయాని, హౌస్ సర్జన్, ఆర్ఎంసీ, కాకినాడ

# ఇక మురికి కూపమే..!

- హూపర్ టిప్పర్ వాహనాలకు బ్రేక్
- తడి-పొడి చెత్త సేకరణకు అవరోధం
- నిధులు లేక నిలిచిపోయిన వైనం



వెహికల్ యార్డులో నిలిచిపోయిన వాహనాలు

కాకినాడ: పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన జిల్లా కేంద్రం కాకినాడ మురికి కూపంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం వాహనాలకు బ్రేక్ పడడమే ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రంలోని సుమారు 100కు పైగా ఉన్న ఈ వాహనాల్లో ప్రస్తుతం దాదాపు 50 శాతానికి పైగా వెహికల్ యార్డుకే పరిమితం కావడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. వాహనాల నిర్వహణకు చెల్లించాల్సిన బాకాయిలు పెద్దఎత్తున పేరుకుపోవడంతో, సంబంధిత కాంట్రాక్టర్ చేతులు ఎత్తివేయడమే ఇందుకు కారణమవుతోంది. ఫలితంగా ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియ నీరుగారుతోంది. వివరాల్లోకి వెళ్తే...స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో 100 హూపర్ టిప్పర్ వాహనాలను సమకూర్చారు. ప్రజల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసి వీటి నిర్వహణ కొనసాగించేవారు. నెలకు రూ.53 లక్షల చొప్పున సుమారు ఆరు నెలలుగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ స్థితిలో వాహనాల నిర్వహణ ఇబ్బందికరంగా మారి, ప్రస్తుతం కాంట్రాక్టర్ చేతులు ఎత్తివేశారు. ఉన్న 110 వాహనాల్లో సుమారు 75 గ్యాస్ ఆధారంగాను మరో 35 వాహనాలు పెట్రోలుతోను నడుస్తున్నాయి. ప్రస్తుతం గ్యాస్‌తో నడిచే 75 వాహనాలు వెహికల్ యార్డుకే పరిమితమయ్యాయి. దీంతో పుష్‌కార్ట్ల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నారు. గత విధానంలో తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానం ఇప్పుడు పూర్తిగా మరుగున పడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే గతంలో ఎంతో శ్రమతో గాడిలో పెట్టిన పారిశుధ్య నిర్వహణ అధ్వాన స్థితికి చేరుకోనుంది. దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోకపోతే, పరిస్థితి తీవ్రత పెరిగి రానున్న కొద్ది రోజుల్లో అధ్వాన పారిశుధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా కాకినాడ మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

#### త్వరలో పరిష్కారం




హూపర్ టిప్పర్ వాహనాల సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. సమస్యను ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం. బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్ఓ, కాకినాడ

### నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సలహాలు సూచనలను డిపో మేనేజర్‌కు, 99592 25534 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు.

### డిప్యూటీ కమిషనర్‌గా మనోహర్



కాకినాడ: నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.మనోహర్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌ను ఇక్కడ నియమించారు. కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న గుంటూరు శేఖర్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనను పుర పరిపాలనా శాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.

### విలీన గ్రామాలపై వచ్చే నెలలో సదస్సు

కాకినాడ సిటీ: కాకినాడలో 8 గ్రామాల విలీన ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ సెప్టెంబర్ 3వ వారంలో సదస్సు, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు గురువారం కలెక్టరేట్‌లో విలేకర్లకు తెలిపారు. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, స్వామినగర్, గంగనాలపల్లి ప్రాంతాల్లో ర్యాలీ జరుగుతుందన్నారు. విలీనం పెండింగ్‌పై స్థానిక పౌర కమిటీల ఆధ్వర్యంలో అర్జీలపై కలెక్టర్ గ్రీవెన్స్ ద్వారా కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన సమాచారంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికే విలీన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. సెప్టెంబర్ 3వ వారంలో నగర సదస్సు అనంతరం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు దూసర్లపూడి పేర్కొన్నారు. ఈయన వెంటన పౌర సంఘం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## క్రీడలతో చక్కటి ఆరోగ్యం

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- జిల్లా క్రీడామైదానంలో ఘనంగా క్రీడా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): క్రీడలతో ఫిట్‌గా ఉండడమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జేసీ రాహుల్ మీనా 3 కిలో మీటర్ల ర్యాలీని ప్రారంభించారు. సుమారు 500 మంది క్రీడాకారులు, క్రీడా ఔత్సాహికులు, శిక్షకులు పాల్గొన్నారు. ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేందుకు రూ.3.14 లక్షలతో కొనుగోలు చేసిన 2 ఎలక్ట్రానిక్ టార్గెట్ మెషీన్లను ఎంపీ, జేసీ చేతుల మీదుగా క్రీడా ప్రాంగణంలోని రైఫిల్ షూటింగ్ హాల్‌లో ప్రారంభించారు. క్రీడాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో మూడు స్థానములు సాధించిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

## నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

భారీ ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు



బాలాత్రిపుర సుందరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలకు సామగ్రిని సిద్ధం చేస్తున్న సేవా సమితి సభ్యులు

బోట్‌క్లబ్: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సుమారు 2 వేల మంది మందితో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఏర్పాట్లను ఈవో చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ ఏర్పాట్లును పరిశీలించారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు ఆలయ కమిటీ పూజా సామగ్రిని సమకూర్చింది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 600 మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొంటారని ఈవో రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు పూజా సామగ్రితో పాటు, భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక రామారావుపేట శివాలయంతో పాటు, స్థానిక జగన్నాథపురం శివాలయంలోను సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

## పాఠశాలలకు ఉత్తమ పురస్కారాలు



డీఈఓ రమేష్ నుంచి పురస్కారాలు అందుకుంటున్న కరప హైస్కూలు హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, కరప పీడీ కె.శ్రీనివాసరావు, గురజనాపల్లి హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, గురజనాపల్లి పీడీ కె.నాగలింగేశ్వరరావు

కరప: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కరప, గురజనాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు రాగా గురువారం కాకినాడలో జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ నుంచి హెచ్‌ఎంలు ఎం.శ్రీనివాసరావు, ఎ.సాయిమోహన్, పీడీ కె.శ్రీనివాసరావు, కె.నాగలింగేశ్వరరావు పురస్కారాలు అందుకున్నారు. వివిధ క్రీడాంశాల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రీడాకారులు ప్రతిభచూపడంతో ఈ అవార్డు వచ్చినట్టు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు తెలిపారు. కరప హైస్కూలుకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, గురజనాపల్లి హైస్కూలుకు ఐదో స్థానం రాగా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయని పీడీలు తెలిపారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు అధికారులు

కాకినాడ క్రైం: హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ గురువారం సాయంత్రం కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ నూని రమేష్ బృందం కలిసి ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సర్పవరం వరకు అక్కడి నుంచి భానుగుడి జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో రఘువీర్ మాట్లాడుతూ హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాపాయాలు నివారించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చోటు చేసుకునే మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవిస్తున్నాయని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీ ఫారం సెంటర్, దుమ్ములపేట, పళ్లంరాజునగర్, సాంబమూర్తినగర్, అయోధ్యనగర్, దుమ్ములపేట రాజీవ్ గృహకల్ప, రెవెన్యూ కాలనీ, సత్యనగర్, స్వర్ణాంధ్రకాలనీ, ఇందిరాకాలనీ, గణేష్‌కాలనీ, జ్యోతుల కాలనీ, టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాకినాడ సిటీ: డీ1 సెక్షన్‌లో 33/11 కేవీ పవర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని డీఎంహెచ్‌వో, బాలాజీ చెరువు ఫీడర్ల వార్షిక మరమ్మతుల కోసం ఉదయం 7.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. కొమ్మిరెడ్డివారి వీధి, పీఆర్ కాలేజీ, అవసరాలవారి వీధి, పిండిప్రోలు వారి వీధి తదితర ఏరియాలకు, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సాలిపేట, బాలాజీచెరువు, రాజారామమోహన్‌రాయ్ రోడ్డు, వినికొండవారి వీధి, తదితర ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదు.

### ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

కాకినాడ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన గ్రంధి సత్యనారాయణ (39) స్థానిక రామకృష్ణారావు పేటలో నివసిస్తున్నాడు. వాకలపూడి జెమినీ ఆయిల్ ఫ్యాక్టరీలో ప్యాకింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి విధులకు వెళ్లి, రాత్రి తిరిగి ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి సమయంలో వాకలపూడి నుంచి రామకృష్ణారావు పేటకు వస్తుండగా కోకిలా బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు సత్యనారాయణను ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై గురువారం సాయంత్రం కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణకు 11 ఏళ్ల క్రితం విజయనగరానికి చెందిన భానుతో వివాహం కాగా వారికి తొమ్మిదేళ్ల కుమార్తె సరయు, ఐదేళ్ల కుమారుడు దీక్షిత్ ఉన్నారు. వీరు స్థానిక సెంటాన్స్ పాఠశాలలో చదువుతున్నారు.

## ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు



కరప హైస్కూలులో హెచ్‌ఎం, ముగ్గురు పీడీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గురజనాపల్లి హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయులు, పీడీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కరప: మండల పరిధి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రామ్మూర్తిపంతులు తెలుగుభాషకు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చేసిన సేవలను కొనియాడారు. పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాల, కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్న పాఠశాలలో ఈ వేడులను ఘనంగా నిర్వహించి విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో తృతీయస్థానంలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చిన సందర్భంగా ఫకీర్రావు పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, కె.కృష్ణలను, తెలుగుపండిట్‌లను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులు ఎ.సూర్యనారాయణ, కేఎస్‌వీ లక్ష్మి, పీడీ కె.నాగలింగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

## మహిళలు, చిన్నారులకు రక్షణగా ఉందాం



పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన ఎస్ఎఫ్ఐ, ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: మహిళలు, చిన్నారులపై జరిగే దాడులను అరికట్టాలని కోరుతూ కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిని ఖండిస్తూ విజయవాడ నుంచి కలకత్తా వరకు బుచ్చిబాబు, ఈడిగ ప్రదీప్‌కుమార్, డి.రాధాకృష్ణ చేపట్టిన పాదయాత్ర గురువారం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ 1400 కిలోమీటర్ల పాదయాత్రకు ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మాట్లాడుతూ సమాజంలో అమ్మాయిలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రచారం చేస్తూ ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. ఈ యాత్రకు మద్దతు తెలియజేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు నాళం ఆండాళ్ సంయుక్తంగా మాట్లాడుతూ ముగ్గురు యువకులు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు సంజయ్, రజిని, కౌశిక్, సునీత, సుజాత, అంబిక తదితరులు పాల్గొన్నారు.

### రుద్రాక్ష గణపతి



రుద్రాక్ష అలంకరణలో ఆకట్టుకుంటున్న విగ్రహాలు

పిఠాపురం: గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన కోలా వీరబాబు రుద్రాక్షలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు. దీనికోసం సుమారు 5 వేల రుద్రాక్షలను ఉపయోగించాడు. వీరబాబు తయారు చేసిన నాలుగు అడుగుల వినాయకుడు, మూడు అడుగుల శివలింగం ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వీటిని వినాయకచవితి ఉత్సవాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపాడు.

## క్రీడాకారులకు ఘనంగా సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులను గురువారం ఘనంగా సన్మానించారు. తొలుత హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా క్రీడాకారుడు పి.లక్ష్మణ్, క్రీడాకారిణి పరమేశ్వరి తదితరులు క్రీడలతో ఉపయోగాలు తెలియజేశారు. అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ, శ్రీనగేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్‌కు లైటింగ్

బోట్‌క్లబ్: ప్రభుత్వ బీసీ వసతి గృహంలో లైటింగ్ వసతిని కల్పిం చేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ముందుకు వచ్చారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని బీసీ వసతిగృహానికి విద్యుత్ లైటింగ్ లేని విషయాన్ని వార్డెన్ మహాలక్ష్మీ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్‌కు వివరించారు. ఈ మేరకు స్పందించిన తలాటం హరీష్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ సౌజన్యంతో రూ.10 వేలతో లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ లైటింగ్‌ను గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి పంపన సాయి, తలాటం హరీష్ గురువారం ప్రారంభించారు.